అబద్ధాలతో గద్దెనెక్కిన చంద్రబాబు

- హామీల పేరుతో ప్రజలకు ద్రోహం
- ఆ మోసాన్ని క్షేత్రస్థాయికి తీసుకెళ్లాలి
- వచ్చే ఎన్నికల్లో టీడీపీ గల్లంతు కావడం ఖాయం
- వైఎస్సార్ సీపీ సమావేశంలో జిల్లా అధ్యక్షుడు వేణు, మాజీ ఎంపీ భరత్ రామ్



సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు చెల్లుబోయిన వేణు



క్యూఆర్ కోడ్ పోస్టర్లను ఆవిష్కరిస్తున్న వేణు, భరత్‌రామ్, గురుమూర్తిరెడ్డి తదితరులు

రాజమహేంద్రవరం సిటీ: ఎన్నికల సమయంలో అనేక అబద్ధపు హామీలు ఇచ్చిన చంద్రబాబు.. అధికారంలోకి వచ్చాక వాటిని అమలు చేయకుండా ప్రజలకు ద్రోహం చేశారని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ అన్నారు. నగరంలోని శనివారం జరిగిన పార్టీ విస్తృత స్థాయి సమావేశంలో రాజమహేంద్రవరం పార్లమెంట్ పరిశీలకులు, మాజీ ఎమ్మెల్యే తిప్పల గురుమూర్తిరెడ్డి, మాజీ ఎంపీ, వైఎస్సార్ సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి భరత్ రామ్‌తో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా వేణు మాట్లాడుతూ సంక్షేమం అంటే ఏమిటో తన పథకాల ద్వారా చెప్పిన ఘనత మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డిదేనన్నారు. కూటమి ప్రభుత్వం హామీలు అమలు చేయకపోవడాన్ని నిరసిస్తూ, జగన్ ఇచ్చిన పిలుపు మేరకు బాబు ష్యూరిటీ – మోసం గ్యారంటీ అంటూ క్షేత్ర స్థాయిలో ప్రజలకు వాస్తవాలు వివరించే ప్రక్రియను ఐదు వారాల్లో పూర్తి చేయాలన్నారు. చంద్రబాబు అధికారంలోకి వచ్చి 13 నెలలైనా ఎన్నికల హామీలను అమలు చేయడం లేదన్నారు.

సాక్షి చానల్ రాకపోతే నిలదీయండి

మాజీ మంత్రి వేణు మాట్లాడుతూ ఆరోగ్యశ్రీ, ఫీజు రీయింబర్స్‌మెంట్, 108 తదితర వాటి ద్వారా దివంగత ముఖ్యమంత్రి రాజశేఖరరెడ్డి, అలాగే అమ్మఒడి, వాహనమిత్ర వంటి నవరత్నాల ద్వారా మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజల హృదయాల్లో నిలిచారన్నారు. కానీ ఎన్నికల హామీలను అమలు చేయకుండా ప్రజలను చంద్రబాబు మోసం చేశారన్నారు. అందుకే జగన్ చేసిన కార్యక్రమాలను ప్రజలు తలచుకుంటున్నారన్నారు. జగన్ ప్రభుత్వంలో నాయకులు గానీ, కార్యకర్తలు గానీ స్వార్థంతో ఆలోచించి ఏ కార్యక్రమం చేయలేదన్నారు. రేషన్ బియ్యం హాస్టల్ పిల్లలు తినడానికి పనికి రావని సాక్షాత్తూ ప్రస్తుత ప్రభుత్వంలో కేబినెట్ మంత్రి చెప్పారని గుర్తు చేశారు. పనికిరాని ఆ బియ్యాన్ని రేషన్ ద్వారా ఎందుకు పంచుతున్నారని నిలదీయాల్సిన అవసరం ఉందన్నారు. ప్రజలను తప్పుదోవ పట్టించేలా వ్యవహరిస్తున్న కూటమి ప్రభుత్వానికి ప్రజలు తగిన గుణపాఠం చెబుతారన్నారు. నిజాలను ప్రజలకు చెబుతున్న సాక్షి చానల్ రాకుండా చేస్తున్నారని, అయితే కేబుల్ బిల్లు కోసం వచ్చే వారికి సాక్షి చానల్ చూపించకపోతే బిల్లు చెల్లించేది లేదని స్పష్టంగా చెప్పాలన్నారు.

చంద్రబాబును రీకాల్ చేయాలి : భరత్ రామ్

వైఎస్సార్ సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, మాజీ ఎంపీ మార్గాని భరత్ రామ్ మాట్లాడుతూ ఎన్నికల హామీలు అమలు చేయలేని చంద్రబాబును రీకాల్ చేయాలంటూ జగనన్న ఇచ్చిన పిలుపును బలంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో చంద్రబాబు ఎప్పుడూ శ్రద్ధ చూపలేదన్నారు. మొన్నటి ఎన్నికల్లో అబద్ధపు హామీలు ఇచ్చి మరోసారి ప్రజలను మోసం చేశారన్నారు. హామీలు ఇవ్వడం, వాటిని నెరవేర్చకపోవడం చంద్రబాబుకి కొత్త కాదన్నారు. 2014 ఎన్నికల్లో జాబ్ కావాలంటే బాబు రావాలి అనే నినాదం ఇచ్చి, అనంతరం గాలికి వదిలేశారని, అలాగే మొన్నటి ఎన్నికల్లో కూడా సూపర్ సిక్స్‌తో సహా ఎన్నో హామీలు ఇచ్చి నెరవేర్చడం లేదన్నారు.

పేదల సంక్షేమమే జగనన్న ధ్యేయం

భరత్ రామ్ మాట్లాడుతూ సమాజంలో పేదవారు మంచి స్థానంలో ఉండాలని జగనన్న ఆకాంక్షించారని, దానికి అనుగుణంగా పేదలు, బడుగు బలహీన వర్గాలకు పలు సంక్షేమ కార్యక్రమాలు అమలు చేశారన్నారు. 2019 నుంచి 2024 వరకు దేశంలో ఎక్కడా లేనివిధంగా ఎన్నో సంక్షేమ పథకాలను జగన్ అమలు చేశారన్నారు. 2019కి ముందు రాజమహేంద్రవరం ఎలా ఉందో, తన హయాంలో ఎలా అభివృద్ధి చెందిందో అందరికీ తెలుసునన్నారు. అధికారంలోకి ఏడాదిలోనే కూటమి ప్రభుత్వంపై ఎంతో వ్యతిరేకత వచ్చిందన్నారు. పథకాల పేర్లు మార్చినంత మాత్రాన ప్రజలు వాస్తవాలు మరచిపోరన్నారు.

వైఎస్సార్ సీపీ గెలుపే లక్ష్యం

ఏ ఎన్నికలు వచ్చినా వైఎస్సార్ సీపీ గెలుపే ధ్యేయంగా పనిచేద్దామని, ముఖ్యంగా రాజమహేంద్రవరంలో విజయం సాధిద్దామని, పొరపాట్లు ఏమైనా ఉంటే సరిదిద్దుకుని అందరూ ఐక్యంగా పనిచేద్దామన్నారు. సిటీ నియోజకవర్గంలోని ప్రతి డివిజన్‌లో పది మందితో కమిటీ, ప్రతి బూత్‌లో పదిమందితో కమిటీ ఉండేలా చేసుకుందామన్నారు. తద్వారా అన్ని బూతుల్లో కలిసి 2,350 మంది నిఖార్సైన కార్యకర్తల బలం ఉంటుందన్నారు. వార్డులను పటిష్టం చేసుకుని పార్టీ పిలుపు ఇచ్చిన అన్ని కార్యక్రమాలను జయప్రదం చేస్తే, రాబోయే కార్పొరేషన్ ఎన్నికలలో పోటీ చేయాలనుకునే డివిజన్ ఇన్‌చార్జికి అవకాశం కల్పిస్తామన్నారు. అనంతరం బాబు ష్యూరిటీ – మోసం గ్యారంటీ ప్రచారం కోసం చంద్రబాబుస్ రీకాలింగ్ క్యూఆర్ కోడ్ పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో బీసీ సంఘాల జేఏసీ నాయకుడు మార్గాని నాగేశ్వరరావు, చందన నాగేశ్వర్, జిల్లా మహిళా అధ్యక్షురాలు మార్తి లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.





సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎంపీ భరత్‌రామ్, కార్యక్రమానికి తరలివచ్చిన వైఎస్సార్ సీపీ శ్రేణులు

క్లుప్తంగా

ఆ ఉత్తర్వులు రద్దు చేయాలి

కంబాలచెరువు: త్వరలో పాఠశాలల్లో జరిగే మెగా పీటీఎంలో విట్నెస్ అధికారిని పాఠశాల ఉపాధ్యాయులే నియమించుకుని, వారి చేత వీడియోలు తీయించి అప్‌లోడ్ చేయాలనే విద్యాశాఖ ఉత్తర్వులను తక్షణం రద్దు చేయాలని తూర్పుగోదావరి యూటీఎఫ్, ఫ్యాప్టో ఉపాధ్యాయ సంఘాలు డిమాండ్ చేశాయి. ఆయా సంఘాల నాయకులు పి.జయకర్, ఎ.షరీఫ్, డేనియల్ బాబు, సువర్ణరాజు మాట్లాడుతూ ఉపాధ్యాయులను బోధనకు మాత్రమే పరిమితం చేస్తామని చెప్పి, మొన్నటి వరకూ యోగా కార్యక్రమాలు, ఇప్పుడు పేటీఎం అంటూ బోధనా సమయాన్ని వృథా చేయటం సమంజసం కాదన్నారు. ఇదే వైఖరితో ప్రభుత్వం ముందుకు వెళితే భవిష్యత్తులో తగిన గుణపాఠం చెబుతామని హెచ్చరించారు. అనంతరం డీఈవో కార్యాలయంలో జిల్లా విద్యాశాఖాధికారిని కలిసి వినతిపత్రం ఇచ్చారు.

నేడు మరిడి మహాలక్ష్మి జాతర

రాజమహేంద్రవరం రూరల్: హుకుంపేట గ్రామ దేవత మరిడి మహాలక్ష్మి అమ్మవారి జాతర ఆదివారం మధ్యాహ్నం 4 గంటల నుంచి ప్రారంభమవుతుందని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. తొలి ఏకాదశి సందర్భంగా ఉదయం 6 గంటల నుంచి అమ్మవారికి అభిషేకం, కుంకుమ పూజలు జరుగుతాయన్నారు. ఈ నెల 8న అమ్మవారికి నైవేద్య సమర్పణ, 9వ తేదీ రాత్రి 7 గంటలకు నర్సిపూడి గ్రామం వారిచే సేవా కార్యక్రమం నిర్వహిస్తామన్నారు.

పిల్లలకు వైద్య పరీక్షలు

కంబాలచెరువు: మిషన్ వాత్సల్య పథకంలో భాగంగా బాలసదనంలోని పిల్లలకు వైద్య శిబిరం నిర్వహించినట్టు జిల్లా ప్రోగ్రాం అధికారి, ఆర్‌బీఎస్‌కే డాక్టర్ హరిచంద్ర శనివారం తెలిపారు. 19 మంది బాల బాలికలకు స్క్రీనింగ్ నిర్వహించి, 4 డి సమస్యలు ఉన్నట్లు గుర్తించామన్నారు. వారిని తదుపరి చికిత్సకు డీఈఐసీ కేంద్రానికి రిఫర్ చేశామన్నారు. కార్యక్రమంలో పిల్లల వైద్యనిపుణులు డాక్టర్ ఇంద్రజ, దంత వైద్య నిపుణులు డాక్టర్ విశ్వనాథ్, బాలసదనం సూపరింటెండెంట్ రోజారాణి పాల్గొన్నారు.

అక్రమ ఆస్తులపై ఏసీబీ సోదాలు చేయాలి

కంబాలచెరువు: జిల్లాలోని సంక్షేమ వసతి గృహాల వార్డెన్ల అక్రమాస్తులపై ఏసీబీ సోదాలు నిర్వహించాలని, హాస్టళ్లలో నెలకొన్న సమస్యలను తక్షణమే పరిష్కరించాలని పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు రఫీ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కిరణ్ కుమార్ డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం ప్రకటన విడుదల చేశారు. విద్యా సంవత్సరం ప్రారంభంలోనే సంక్షేమ వసతి గృహాలు విద్యార్థులను సమస్యలతో స్వాగతం పలుకుతున్నాయన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ సంక్షేమ వసతి గృహాల్లో కనీస మౌలిక వసతులు కరువయ్యాయన్నారు. కాస్మోటిక్, మెస్ చార్జీలు విడుదల చేయాలని, ఖాళీగా ఉన్న కమాటి, వాచ్‌మన్, వంట మాస్టర్, వార్డెన్ పోస్టులను భర్తీ చేయాలన్నారు.

ప్రైవేటుపరం చేయడానికే స్మార్ట్ మీటర్లు

ప్రకాశం నగర్: విద్యుత్ రంగాన్ని ప్రైవేటుపరం చేయడానికే స్మార్ట్ మీటర్లు బిగిస్తున్నారని, తక్షణమే ఆ విధానాన్ని రద్దు చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి తాటిపాక మధు డిమాండ్ చేశారు. స్మార్ట్ మీటర్లకు వ్యతిరేకంగా శనివారం స్థానిక వై.జంక్షన్ సమీపంలోని ఏపీఈపీడీసీఎల్ డీ5 కార్యాలయం ఎదుట ఆ పార్టీ నాయకులు ధర్నా చేశారు. మధు మాట్లాడుతూ తక్షణమే ప్రభుత్వం ఆదాని చీకటి ఒప్పందాన్ని రద్దు చేసుకోవాలని డిమాండ్ చేశారు. ఆందోళనలో కె.రాంబాబు, వి.కొండలరావు తదితరులు పాల్గొన్నారు.

భోజనం ప్యాకెట్ల వితరణ

ధవళేశ్వరం: వైఎస్సార్ సీపీ రూరల్ మాజీ కో ఆర్డినేటర్, బాధ్యత సేవా సంస్థ వ్యవస్థాపకుడు గిరజాల బాబు జన్మదినం సందర్భంగా శనివారం ధవళేశ్వరంలోని స్ఫూర్తి చారిటబుల్ ట్రస్ట్ కార్యాలయంలో వృద్ధులు, దివ్యాంగులకు అన్నదానం చేశారు. గిరజాల బాబు మిత్ర బృందం సర్కార్ బాషా, పున్నమరాజు వీర్రాజు తదితరులు భోజనాలు అందించారు. ట్రస్ట్ అధ్యక్షుడు ముత్యాల పోసికుమార్ తదితరులు పాల్గొన్నారు.

కోనేరు మురళికి పరామర్శ



సుష్మంత్ చిత్రపటానికి పుష్పాంజలి ఘటిస్తున్న ఎమ్మెల్సీ రాజశేఖర్ తదితరులు

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): పుత్ర వియోగంతో బాధపడుతున్న నగర ప్రముఖుడు కోనేరు మురళిని శనివారం పలువురు పరామర్శించారు. ఆయన కుమారుడు సుష్మంత్ వెంకట్ ఇటీవల మృతి చెందిన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా సుష్మంత్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కోనేరు మురళి, ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించారు. వారిలో ఎమ్మెల్సీ పేరాబత్తుల రాజశేఖర్, మాజీ ఎంపీ ఉండవల్లి అరుణ్ కుమార్, మాజీ ఎమ్మెల్సీ రెడ్డి సుబ్రహ్మణ్యం, మాజీ చాంబర్ అధ్యక్షుడు అశోక్ కుమార్ జైన్, గోపాలపురం మండల టీడీపీ మాజీ అధ్యక్షుడు గద్దే హరిబాబు, చిట్యాల సర్పంచ్ నూతంగి దొరబాబు, మాజీ కార్పొరేటర్ గొర్రెల సురేష్, ఆటో యూనియన్ సభ్యులు ఉన్నారు.

ఎక్సైజ్ టాస్క్‌ఫోర్స్ విస్తృత దాడులు



భూపాలపట్నంలో స్వాధీనం చేసుకున్న 1,205 కిలోల బెల్లంతో ఎక్సైజ్ టాస్క్‌ఫోర్స్ బృందం

రాజమహేంద్రవరం రూరల్: జిల్లా ఎక్సైజ్ టాస్క్‌ఫోర్స్ (ఈఎస్‌టీఎఫ్) అధికారులు, సిబ్బంది శుక్రవారం కోలమూరు, భూపాలపట్నంలో విస్తృత దాడులు నిర్వహించారని జిల్లా ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ అధికారి సీహెచ్ లావణ్య తెలిపారు. ఈ సందర్భంగా 270 లీటర్ల సారా, 1,205 కిలోల బెల్లం, 1,400 లీటర్ల బెల్లం ఊటను స్వాధీనం చేసుకుని నలుగురిని అరెస్టు చేశారన్నారు. ఈఎస్‌టీఎఫ్ ఏఈఎస్ పీఎస్ రాహుల్, ఇన్‌స్పెక్టర్ పి.హనుశ్రీ, ఎస్సై రామాంజనేయులు, సిబ్బందితో కలిసి కోలమూరు, భూపాలపట్నంలో విస్తృత దాడులు నిర్వహించారు. కోలమూరుకు చెందిన దాసరి నాగేశ్వరరావు, ఎనుగంటి వెంకటేష్, రఘునాథపురానికి చెందిన గోనబోయిన వాసు, భూపాలపట్నానికి చెందిన రేలంగి నాగమహిలను అరెస్టు చేసి రిమాండ్ పంపారు. మరో ముగ్గురు పరారీలో ఉన్నారు.

శాకంబరిగా ముసలమ్మ తల్లి



కడియం: ఆషాఢ మాసం ప్రత్యేక పూజల్లో భాగంగా కడియపులంక గ్రామ దేవత ముసలమ్మ అమ్మవారికి శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు సమర్పించిన వివిధ రకాల పండ్లు, పువ్వులు, కూరగాయలు, ఆకుకూరలతో అమ్మవారిని అలంకరించారు. పెద్దసంఖ్యలో భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు.

ఘనంగా సహకార దినోత్సవం

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): దేశాభివృద్ధిలో సహకార సంఘాలు కీలకపాత్ర పోషిస్తున్నాయని జిల్లా సహకార అధికారి ఎం.వెంకటరమణ అన్నారు. ఆయన ఆధ్వర్యంలో శనివారం అంతర్జాతీయ సహకార దినోత్సవాన్ని నిర్వహించారు. ప్రభుత్వ కళాశాల నుంచి ఆర్యాపురం అర్బన్ బ్యాంకు వరకూ ర్యాలీ నిర్వహించారు. అనంతరం సహకార పతాకావిష్కరణ చేశారు. బ్యాంకు ఆవరణలో ఏర్పాటు చేసిన సమావేశంలో వెంకట రమణ మాట్లాడుతూ గ్రామీణ స్థాయిలో విద్య, ఆరోగ్యం, వ్యవసాయం, జీవనోపాధి రంగాల్లో సహకార సంస్థలు అనేక మార్పులు తీసుకొచ్చాయన్నారు. ఇన్నీసుపేట కోఆపరేటివ్ బ్యాంకు చైర్మన్ కోళ్ల అచ్యుత రామారావు(బాబు), జిల్లా కో ఆపరేటివ్ ఆడిట్ అధికారి ఎం.జగన్నాథరెడ్డి, విభాగ సహకార అధికారి ఎం.కనక దుర్గారెడ్డి, ఆర్యాపురం అర్బన్ బ్యాంకు సీఈఓ జి.సుధాకరరావు, జాంపేట బ్యాంకు సీఈఓ ఎం.విజయ ప్రతాప్ పాల్గొన్నారు.

రోడ్డు నిబంధనలపై అవగాహన

కంబాలచెరువు: స్థానిక ఎస్‌కేవీటీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు శనివారం రోడ్డు నిబంధనలపై ట్రాఫిక్ సీఐ ఎండీ అబ్దుల్ నబీ అవగాహన కల్పించారు. ఎన్ఎస్ఎస్ యూనిట్ల ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ వాహనాలు నడిపే ప్రతి విద్యార్థికీ డ్రైవింగ్ లైసెన్సు తప్పనిసరిగా ఉండాలన్నారు. ట్రాఫిక్ చట్టాలపై అవగాహన పెంచుకుని, నిబంధనలు పాటించాలన్నారు. ఇటీవల కాలంలో సైబర్ నేరాలు, మోసాలు అధికమయ్యాయని, వాటిపై పూర్తి అవగాహన పెంచుకోవాలన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బీవీ.తిరుపాణ్యం మాట్లాడుతూ దేశ భవిష్యత్తు యువత చేతిలో ఉందని, తొందరపాటుతనంతో నిర్లక్ష్యంగా వాహనాలు నడిపి ప్రమాదాలకు గురి కావద్దన్నారు. కార్యక్రమంలో కళాశాల తెలుగుశాఖాధిపతి డాక్టర్ పీవీబీ సంజీవరావు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ఉపకార వేతనాల పంపిణీ



ఉపకార వేతనాలు అందుకున్న విద్యార్థులతో సంస్థ సభ్యులు

సీటీఆర్ఐ: వాకర్స్ యోగా అండ్ లాఫింగ్ క్లబ్ స్వచ్ఛంద సేవాసంస్థ ఆధ్వర్యంలో ఎస్‌కేవీటీ డిగ్రీ కళాశాల ఆనంద గార్డెన్స్‌లో క్లబ్ అధ్యక్షుడు శనపతి సత్తిబాబు అధ్యక్షతన శనివారం విద్యార్థులకు ఉపకార వేతనాలు అందజేశారు. జ్ఞాన సరస్వతీ పీఠం చారిటబుల్ ట్రస్టు వ్యవస్థాపకుడు తోట సుబ్బారావు, దివాన్ చెరువు ఢిల్లీ పబ్లిక్ స్కూలు వైస్ చైర్మన్ చలుమూరి శ్రీనివాస్, కాంట్రాక్టర్ తమనంపూడి రామిరెడ్డి, చల్లా శివ, డాక్టర్ కంటే వీరన్న చౌదరి, ఎ.రమణ ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. ప్రతిభ కలిగిన పేద విద్యార్థులకు ఆర్థిక సహాయం చేసిన కీర్తిశేషులు పాలసానపల్లి జగ్గారావుకు నివాళులర్పించారు. క్లబ్ కార్యదర్శి గుబ్బల గంగాభవాని కుమారుడు రవిరాజ్ కుమార్ రూ.25 వేలు, తమనంపూడి రామిరెడ్డి రూ.10 వేలు, భేరి రత్నాంబ, అలాగే సీహెచ్ సత్యవాణి, ఏవీ రమణ, పి.సూర్యప్రభావతి కలసి రూ.40 వేలు, క్లబ్ కార్యదర్శి గుబ్బల గంగాభవాని, స్నేహితులు రూ.లక్ష, చలుమూరి శ్రీనివాస్ రూ.10 వేలు, పి.సాయి సూర్య ప్రహర్ష రూ.10 వేలు, యు.కాశీ విశ్వనాథం రూ.10 వేలు, చెల్లుబోయిన సూర్యనారాయణమూర్తి రూ.5 వేలు, ఎ.శ్రీనివాస్ రూ.6 వేలు అందజేశారు. ముఖ్య అతిథుల చేతుల మీదుగా 30 మంది ఇంటర్ పాలిటెక్నిక్, డిగ్రీ, ఇంజనీరింగ్ విద్యార్థులకు రూ.3,10,000 ఉపకార వేతనాలు పంపిణీ చేశారు. అలాగే 80 మంది వృద్ధులకు ఒక్కొక్కరికి రూ.500 చొప్పున రూ.40 వేలు పింఛన్ల రూపంలో అందించారు. కోశాధికారి యు.కాశీ విశ్వనాథం జన్మదినం సందర్భంగా వృద్ధులకు అల్పాహారాన్ని అనసూరి శ్రీనివాస్, గుబ్బల గంగాభవాని భోజనాలు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో క్లబ్ వ్యవస్థాపకులు పామర్తి గోపాలరావు, సూరపరెడ్డి తాతారావు, భేరి రత్నాంబ, మొగల్తూరు దుర్గ తదితరులు పాల్గొన్నారు.

చెత్త సేకరణ సక్రమంగా చేపట్టాలి

కడియం: స్వర్ణాంధ్ర – స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా ఇంటింటి చెత్త సేకరణను సక్రమంగా చేపట్టాలని జిల్లా పంచాయతీ అధికారి శాంతకుమారి ఆదేశించారు. మండలంలోని మాధవరాయుడుపాలెం, వేమగిరి, కడియపుసావరం గ్రామాల్లో శనివారం ఆమె పర్యటించి, చెత్త సేకరణపై ప్రజలకు అవగాహన కల్పించారు. తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించేందుకు తమ సిబ్బందికి సహకరించాలన్నారు. పారిశుద్ధ్య చెత్త సేకరించే విధానంపై ఆయా గ్రామాల ప్రజలను ఆరా తీశారు. ఆమె వెంట డీఎంపీడీవో ఐ. శ్రీనివాసరావు ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

కడియం: కడియపులంక వద్ద జాతీయ రహదారిపై శుక్రవారం అర్ధరాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో బుర్రిలంక గ్రామానికి చెందిన సీహెచ్ దుర్గారావు (27) మృతి చెందాడు. కడియం పోలీసుల వివరాలిలా ఉన్నాయి.. దుర్గారావుతో పాటు కె.సూర్య, కె.తరుణ్ మోటారు సైకిల్‌పై కడియపులంక వైపు నుంచి మడికి వైపునకు వెళుతున్నారు. వీరు ప్రయాణిస్తున్న మోటారు సైకిల్ ప్రమాదవశాత్తూ డివైడర్‌ను ఢీకొనడంతో దుర్గారావు అక్కడికక్కడే మృతి చెందాడు. మిగిలిన ఇద్దరు గాయాలయ్యారు. వారిని 108లో ఆసుపత్రికి తరలించారు.

డ్రైవర్లను విధుల్లోకి తీసుకోవాలి

ప్రకాశం నగర్: ఓఎన్‌జీసీలో అక్రమంగా తొలగించిన డ్రైవర్లను తక్షణమే విధుల్లోకి తీసుకోవాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు టి.అరుణ్ అన్నారు. స్థానిక మున్సిపాల్ స్టేడియం సమీపంలోని సీపీఐ కార్యాలయంలో శనివారం కేంద్ర కార్మిక సంఘాల ఐక్య వేదిక సమావేశం జరిగింది. ఈ సందర్భంగా అరుణ్ మాట్లాడుతూ ఓఎన్‌జీసీలో రెండున్నరేళ్లుగా కాంట్రాక్టర్లు అగ్రిమెంట్ ఉల్లంఘనకు పాల్పడుతున్నారని ఆరోపించారు.

కాపాడమ్మా.. సోమాలమ్మా..



పుష్కరఘాట్ వద్ద గోదావరి జలాల కలశాలతో భక్తులు



కలశాలతో ఆలయానికి బయలుదేరిన ఊరేగింపు



కలశాలు ఎత్తుకున్న యువతులు

సీటీఆర్ఐ: రాజమహేంద్రవరం గ్రామ దేవత అయిన కొత్తపేట సోమాలమ్మకు ఆషాఢమాసం సందర్భంగా శనివారం 108 కలశాల గోదావరి జలాలతో అభిషేకం చేశారు. ముందుగా అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. 108 మంది ముత్తయిదువులు పుష్కరఘాట్ వద్ద నుంచి గోదావరి జలాలను ఊరేగింపుగా తీసుకువెళ్లి అమ్మవారికి జలాభిషేకం చేశారు. మంగళ వాయిద్యాలతో అత్యంత వైభవంగా ఈ కార్యక్రమం జరిగింది.